AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
4-2-2026 (Wednesday)
MAIN EDITION

ప్రభుత్వ రంగ సంస్థలో అప్రెంటిస్ అవకాశాలు

అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ యంత్ర ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఆర్డినెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీలలో ట్రేడ్ అప్రెంటిస్‌ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 3,979 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పదో తరగతి, ఐటీఐ పూర్తి చేసినవారు అర్హులు. ఎంపికైనవారికి ఆర్డినెన్స్, ఆర్డినెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీల్లో శిక్షణ ఇస్తారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిశా, బిహార్, చండీగఢ్‌లో శిక్షణ కేంద్రాలున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ సమయంలో స్టైఫండ్ ఇస్తారు. ఆన్‌లైన్ ద్వారా మార్చి 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం https://recruitgov.com లేదా yantraindia.co.in వెబ్‌సైట్‌లలో సంప్రదించవచ్చు.

ప్రణీత్‌రావు డీఎస్పీ హోదా రద్దు

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ కేసులో కీలక నిందితుడు ప్రణీత్‌రావు డీఎస్పీ హోదాను రద్దు చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దుగ్యాల ప్రణీత్‌రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గతంలోనే గుర్తించారు. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేసి, అరెస్ట్ కూడా చేశారు. డీఎస్పీ పదోన్నతి పొందిన అనంతరం ప్రొబేషన్ సమయంలో అతడు అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో డీఎస్పీ పదోన్నతి రద్దు చేశారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం

అక్షరటుడే, నేషనల్ డెస్క్: జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిని జైషే మహ్మద్‌కు చెందినవారుగా గుర్తించారు. వారి నుంచి ఎం4 కార్బైన్ రైఫిల్స్, ఏకే-47 రైఫిల్స్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య

అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36).. విజయవాడ వైపు వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద పడి సూసైడ్‌కు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని సమాచారం.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

అక్షరటుడే, నేషనల్ డెస్క్: మణిపూర్ రాష్ట్రంలో సుమారు ఏడాది కాలంగా కొనసాగుతున్న రాష్ట్రపతి పాలనను ఎత్తివేశారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సీఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పాలన ఎత్తేశారు.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. దీంతో పట్టణాల్లో ప్రచారం జోరందుకుంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. తమను గెలిపించాలని వేడుకుంటున్నారు. మరోవైపు ప్రధాన పార్టీల నేతలు సైతం రంగంలోకి దిగారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా బుధవారం రాష్ట్రానికి వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రచార బాట పట్టారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

ప్రచార హోరు

- పురపోరులో దూసుకుపోతున్న పార్టీలు
- గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు
- జిల్లాల్లో సీఎం రేవంత్ సభలు
- మహబూబ్‌నగర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు

రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 2,996 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా వార్డులకు భారీగా నామినేషన్లు వచ్చాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఒకటి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. గెలుపు గుర్రాలకు ఆయా పార్టీలు టికెట్లు కేటాయించాయి. మిగతావారిని పార్టీ నేతలు బుజ్జగించి పోటీ నుంచి తప్పుకునేలా చేశారు. మొత్తం 6,701 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రస్తుతం 12,993 మంది బరిలో నిలిచారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 14 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. అందులో 12 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఉన్నారు.

సీఎం ప్రచార బాట

మున్సిపల్ ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. బుధవారం ఆయన మిర్యాలగూడలో సభలో ప్రసంగిస్తారు. సీఎం ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల్లో కాకుండా.. సమీపంలోని గ్రామాల్లో సభ నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు రోజుకో జిల్లాలో సీఎం సభ ఉండనుంది. 5న కరీంనగర్‌లో, 6న నిజామాబాద్, 7న రంగారెడ్డి, 8న వరంగల్ జిల్లాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభిస్తారు. అలాగే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యే ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయా మున్సిపాలిటీల్లోని వార్డుల్లో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

కమలంలో జోరు

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన ఫలితాలు రాలేదు. మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ జోరు కొనసాగిస్తోంది. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడానికి అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రచారంలో పాల్గొంటున్నారు. బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సైతం రాష్ట్రానికి వచ్చారు. ఆయన మహబూబ్‌నగర్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం రెండు సభలకు హాజరు కానున్నట్లు తెలిసింది. ఆయన నిర్మల్‌కు వస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అమిత్ షా సభ కోసం ఏర్పాట్లు సైతం చేస్తున్నాయి. మరో వైపు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

బీఆర్ఎస్ సైతం

బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో కాస్త వెనుకబడినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థులు స్థానికంగా ఇంటింటికి తిరుగుతూ తమను గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. అయితే ముఖ్య నేతలు ఇంకా ప్రచార బాట పట్టలేదు. కేసీఆర్ ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదు. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఇతర నేతలు ప్రచారం చేయనున్నారు.

స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదు : జగదీశ్‌రెడ్డి

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్ కొట్టివేయడంపై ఆయన స్పందించారు. జగిత్యాల ఎమ్మెల్యేపై జగదీశ్‌రెడ్డి అనర్హత పిటిషన్ వేయగా.. దానిని బుధవారం స్పీకర్ డిస్మిస్ చేసిన విషయం తెలిసిందే. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ గారికి కనపడకపోవడం విచారకరమని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆ ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ చర్యలపై ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదన్నారు. వాళ్లను డిస్పస్ చేయడం ఖాయమన్నారు. స్పీకర్ నిర్ణయంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

ఉపఎన్నికలకు భయపడుతున్న కాంగ్రెస్: కేటీఆర్

అక్షరటుడే, హైదరాబాద్: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. స్పీకర్ తీరు రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు అని విమర్శించారు. పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్లు వేయగా స్పీకర్ 8 పిటిషన్లు కొట్టివేసిన విషయం తెలిసిందే. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు బుధవారం ఫిరాయింపు కేసులో ఊరట ఇచ్చారు. ఆయన పార్టీ మారినట్లు ఆధారాలు లేవని పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సంజయ్‌కు సీఎం కండువా కప్పిన ఫొటోలు కనిపిస్తున్నా.. ఆధారాలు లేవనడం అర్థరహితమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఉప ఎన్నికలకు భయపడుతోందన్నారు. ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫొటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా.. ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అవుతుందన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కి ఊరట

అక్షరటుడే, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు స్పీకర్ ఊరట కల్పించారు. ఆయనపై అనర్హత పిటిషన్‌ను కొట్టివేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ అనంతరం కాంగ్రెస్ గూటికి చేరిన విషయం తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి వేసిన అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై గతంలోనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచారణ చేపట్టారు. తా జాగా తీర్పు వెల్లడించారు. అనర్హత పిటి షన్‌ను డిస్మిస్ చేశారు. సంజయ్ పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవన్నారు. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు చెప్పారు. తన జీతం నుంచి ప్రతినెలా రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీ ఫండ్ కింద జమ అవుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన సమయంలో బీఆర్ఎస్ విప్ జారీ చేస్తే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు.

మహిళా న్యాయవాది దారుణ హత్య

అక్షరటుడే, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళా న్యాయవాదిని దుండగులు మెడపై నరికి హత్య చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శివారులోని పొలం వద్ద చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న స్వప్న (34) అనే న్యాయవాది హత్య జరిగింది. అయితే ఆమెను సొంత అన్ననే హత్య చేసినట్లు తెలుస్తోంది. కుటుంబ, ఆస్తి తగదాలే ఈ హత్యకు కారణమని సమాచారం. కాగా స్వప్న హత్యపై చేవేళ్ల కోర్టు న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. కొరియన్ ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలుగా మారి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. ఘజియాబాద్‌లో ముగ్గురు బాలికలు మంగళవారం అర్ధరాత్రి ఒక భవనంలోని 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సంఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో ముగ్గురు సోదరీమణులు "సారీ మమ్మీ, సారీ పాపా..." అని రాశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాలికలు ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ఆడడానికి బానిసలయ్యారు. మంగళవారం గేమ్ చివరి టాస్క్ పూర్తి చేసిన తర్వాత వారు 9వ అంతస్తు నుంచి దూకారు. పోలీసులు బాలికల ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గేమ్‌లో మొత్తం 50 టాస్క్‌లు ఉన్నాయి. మృతి చెందిన బాలికలను పాఖీ (12), ప్రాచి (14), విశిక (16)గా గుర్తించారు. ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లు అన్ని పనులు కలిసే చేసేవారు. కొవిడ్ అనంతరం వీరు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలు మారినట్లు వారి తండ్రి తెలిపారు. సమాచారం అందుకున్న షాలిమార్ గార్డెన్ ఏసీపీ అతుల్ కుమార్ సింగ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. బాలికలు తమకు తామే కొరియన్ పేర్లను పెట్టుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో గేమ్‌లో భాగంగానే వారు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్ల జారీలో భారీ మార్పులు

అక్షరటుడే, హైదరాబాద్: విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. స్తంభాలు, లైన్స్ కోసం గతంలో వినియోగదారుల నుంచి దూరం ఆధారంగా డబ్బు వసూలు చేసేవారు. కానీ.. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. 1 కిలో వాట్ కనెక్షన్‌కి రూ.500 కడితే చాలు. ఒకటి నుంచి 5 కిలోవాట్ల వరకు రూ.3,500 వరకు ఛార్జీ వసూలు చేయనున్నారు.

జేఈఈ మెయిన్ ప్రొవిజినల్ కీ విడుదల

అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్: జేఈఈ మెయిన్ 2026 (సెషన్1) ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదలైంది. జనవరి 21 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరగ్గా.. పేపర్ 1కు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ, రెస్పాన్స్ షీట్లను ఎన్‌టీఏ అధికారులు బుధవారం విడుదల చేశారు. ఈ కీపై ఫిబ్రవరి 6వ తేదీ రాత్రి 11.50గంటల వరకు అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన ఎస్ఈ

అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. భారీ అవినీతి తిమింగలాన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి రూ.15 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో, అతడి నివాసంలో అధికారులు సోదాలు చేశారు. సదరు ఎస్ఈ ఓ కాంట్రాక్టర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో ఆయన ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో లంచం తీసుకుంటుండగా ఎస్ఈ చిన్నారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.